

# జేబులూ – గుండీలూ

క్రొవ్విడి లక్ష్మన్న

నిన్న గోపాలరావుగారింట్లో విస్తరి ఉగాది కదూ, సరదాగా కాలక్షేపంచేద్దాం రమ్మన్నాడు. నేను వెళ్ళేసరికి అప్పుడే తలంటుపోసుకుని, కొత్త సూటు తొడుక్కుంటున్నాడు గోపాలరావు ఫ్యాష న్లకి పెట్టిందిపేరు వాడో. నన్ను చూడగానే వో మందహాసం పారేసి, స్టూలుమీద కూచుని మేజోళ్ళు తొడుక్కుంటూన్నవాడల్లా నిటారుగా నుంచుని, కాళ్ళు ఒక్కసారి రలాయించి, ముని వేళ్ళతో సిల్కుషర్టు పంట్లాంలోకి సర్దుకుంటూ, "షర్టు బావుందా? జేబుల్లేవు మరి" అన్నాడు జేబులమయంగాఉన్న నా ఉడుపులు చూస్తూనూ.

"నిజం చెప్పొద్దూ, జేబుల్లేకపోతే యేదో వెలితిగ ఉంటుంది నాకు" అన్నాను. అక్కణ్ణుంచి జేబుల పుట్టుపూర్వోత్తరాలు ఆరాతియ్యడం మొదలెట్టేం "జేబుల చరిత్ర" అంటూ యెవ్వడూ రాసేడుకాడు కాని, వాటి సంగతి తరిచి చూసినకొద్దీ జేబులు ఎంత ఎక్కువగాఉంటే దుస్తులు అంత నవనాగరికంగా ఉన్నయేమో ననిపిస్తుంది.అసలా మాటకొస్తే జేబులే లేకపోతే దుస్తుల్లో నాగరికతే కొరతపడేదేమో! మరీ అన్ని జేబులు అనవసరం అనుకుంటారు కొందరు. కాని నిజం ఒప్పుకోవాలిసివస్తే అనవసరం అయిన వస్తువులు ఎన్ని ఉంటే అంత "మోడర్న్" అన్న మాట తట్టక మానదు. ఒక్క నిమషం మీరే ఆలోచించండి. నాలుగుమూలలా వెలుతురు వెద జిమ్ముతూ ప్రకాశిస్తూన్న బల్బుకి చుట్టూ వో 'డోము!' అది లేకపోతే "ఏవిటో వెల్తురు మరీ ఎక్కువగా ఉంది! ఆ 'డోము' బురఖా తొడిగేస్తే చాలా బావుంది' అని మెచ్చుకుంటాం. అది అలా ఉండగా వెలుతురు చాలనట్టు టేబిలు లైటు కూడా ఉంటేనేగాని, బల్లమీద హంగు పూర్తికాదు. ఈ పంపిణిలోదే సేవింగు ఫేను ఉంటూ ఉండగా టేబిలు ఫేను! అనవసరప్రసక్తివచ్చి, ఏదో పట్టా తప్పిపోయేనులాగుంది— జేబుల గురించికదూ అంటున్నానూ?

మరేం. నా సూటు చూస్తే—ప్యారిస్‌లో కుట్టించింది సుమండీ, ఏవిటో అనుకునేరు!—వో డజను జేబులు కనిపిస్తాయి, కోటుకి అయిదూ, వేస్టుకోటుకి మూడూ, పంట్లానికి నాలుగూనూ. సివిలియన్‌సూటుకి అంతకన్నా ఎక్కువ జేబులు ఉండడానికి మరి అవకాశంలేదు మిలటరీవాళ్ళపంట్లాం కయితే పై తొడలమీదుగా జేబులుంటాయి. కాని వాళ్ళవూసు మనకెందుకూ ?

అయితే యీ జేబుల చరిత్రలో విచిత్రం ఏవిటీ అంటే అవి అన్నీ పాపం మొదట్లో ఎందుకో ఒకందుకు ఉపయోగించాలని నిర్ణీతంగా ఏర్పడ్డాయి టెయిలర్ల ధర్మమా అని. కాని మానవుడున్నాడే అది ఆపనికి ఉపయోగించకుండా ఎలా ఉండడమా అని ఆలోచిస్తూ ఉంటాడు. ఎప్పుడూను! మాట చెబుతున్నాను. ఎవడో టెయిలరు ఎంతో ఆలోచించి, విడిగాఉన్న పై జేబులో పెట్టుకుంటే విలవయినవస్తువ క్రిందపడిపోయి పాడయిపోతుంది కదా అని, ఆ షర్టు పై జేబుకి పక్కనించే "వాచీ పోకెట్టు" ఒక్కటి చమత్కారంగా సృష్టించేడు. కాని ఆ వాచీ జేబు ఏ ముహూర్తాన సృష్టించాడో కాని, పాపం ఆ వాచీలే వాడడం మానేసేరు ప్రజలు. రిస్టువాచీ ఫేషనయిపోయింది. వాచీ జేబు పూరికే ఉండిపోయింది. కాని, వాచీ జేబులేనిదే బెంగాలీ కుడతా కళ్ళపడదు, యిప్పటికీనీ. వాచిజేబు గురించి ఏదో చమత్కరించేను అనుకుంటున్నారు కాబోలు. అబ్బే—మీ కోటు పైపోకెట్టే తీసుకోండి మాటకి. క్రిందటి శతాబ్దంలో కేవలం జేబు రుమాలుకోసమే పుట్టింది అది. అందుకేకాదూ వస్తువపేరు కూడా 'జేబురుమాలు" అయిపోయింది! కాని ఉపయోగించే మానవుడి బుర్ర పని చేస్తూనే ఉంది. వెంటనే ఫేషను మారిపోయింది ఆ జేబు జేబులా ఉండిపోగా,రుమాలు మాత్రం కోటు చేతుల్లో స్థావరం ఆక్రమించుకుంది.

నిజం చెప్పాలంటే, జేబులు పుట్టేసరికి వాట్ని ఎలా నిరుపయోగంగా ఉంచడవా అన్న ఆలోచనే నాయె, మానవుడికి!పంట్లాం జేబుల్లో చేతులుపెట్టుకువిఆఫీసరుముందు నుంచుంటే ఇంకేమయినావుందీ? పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకోవడం 'సభ్యత' కాదని స్కూలు మాస్టర్లు చెవులు నులిమి చెబుతారు—డాక్టర్లయితే బొత్తిగానూ—గూని వస్తుందిట. అసలు పంట్లాం జేబులు అంత నిరువ





యోగం అయితే, ఆదిలో ఎందుకు పుట్టేయి? అందులోనూ రెండెందుకూ? ఇన్నీ అనుకున్నా జేబు ల్లేందే పంట్లాం అని మాత్రం అనిపించుకోదు.

పంట్లాం జేబుల మాట అలా ఉండనివ్వండి. కోటుకిఉన్న జేబులు కూడా సవ్యంగా వినియో గించుకుంటున్నా'వా అని నా సందేహం కాని యదా ర్థం ఆలోచిస్తే మట్టుకు మొగాడికి కావలసిన నిత్యావసరాలు అన్నీ రెడీగా ఉంచుకోడానికే పుట్టేయి ఈ జేబులు—బస్సుస్టాండు దగ్గిర కొనుక్కున్న పత్రికా, రైలు స్టేషనులో కొనుక్కున్న నోవెల్సూ, నక్షత్ర ఫలితాల పుస్తకాలూ, సిగరెట్టు ప్యాకెట్లు అగ్గిపెట్టెలూ, కలం, పెన్సిలూ, తాళాల గుత్తీ, మనీపర్సూ యిత్యాదులు వోసారి తెల్లవారుఝాంనే ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. కుంపటి అంటించి కాఫీ కాద్దాం అనుకుంటే మా ఆవిడకి అగ్గిపెట్టె దొరకలేదు యిల్లంతా గాలించినానూ. చెడ్డ విసుక్కుంది కాఫీ అందివ్వలేకపోయినాను కదా అని. ఆ తరవాత నేను బట్టలు తొడు క్కుంటూంటే సూటు జేబుల్లోంచి బయట పడ్డాయి—మూడు పెట్టెలూ, వో లైటరున్నూ!! కాని స్టూడెంటుగా ఉన్నంతకాలవూ మాత్రం వీటిని సవ్యంగా ఉపయోగించుకోలేకపోయేను. (జేబులు సుమండీ అగ్గిపెట్టెలుకావు — అవి పాపం నిత్యాగ్నిహోత్రానికి బాగానే తోడుపడేవి) ఆ రోజుల్లో అంటే స్టూడెంటుదశ రోజుల్లో జేబుల్లో వస్తువులు పెట్టుకుంటే సూటు ఆకా రం చెడిపోతుందని నమ్మకం. బంగాళాదుంపలు వేస్తే బస్తా ఆకారం చెడిపోతుందా? కాని ఏవిటో ఆ రోజుల్లో అలా అనిపించేది—యిప్పటికీ స్టూడెం ట్సుకి అలాగే అనిపిస్తుంది "ఆ నయాపైసలన్నీ




అక్కడ పారేసి, రెండు రూపాయి నోట్లు పట్టికెళ్ళ కూడదు కక్కా? చూడు, ఆ సిల్కు కోటు జేబు ఎలా సాగిపోతోందో కోతిదవడల్లాగ!!" అంటాడు మా అన్నయ్య కొడుకు నానిగాడు. అంతెందుకూ మొన్నమొన్నటి ముచ్చట—హఠాత్తుగా మీటిం గుకి వెళుతూ చొక్కాజేబులో ఏవో వో దొంతి ఉత్తరాలూ, కోటులోపలిజేబులో పర్సూ, ప్యాసు పోర్టూ, ఆజాపతు తతిమ్మా కాగితాలూ, పై జేబులో రుమాలూ ఆ వీ యి వీ యేవో పెట్టుకుని ఎయిరోడ్రోముకి వెళ్ళేసరికి—




అక్కడ ఎక్సయిజు గుమాస్తా నాఛాతీ ఒక్కక్షణం పరీక్షగా చూసి—నన్ను కాస్త మెడికల్ ఆఫీసరికి వప్పజెప్పేసేడు మొగాడినో ఆడదాన్నో తెలికా! ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే, జేబుల్లో వస్తువులు పెట్టుకుంటే సూటు పాడయిపోతుందనే సూత్రం నాకు అర్థంకాలేదు బట్టలు పెట్టుకుంటేసూటుకేసు తగులబడిపోతుందా? ఏవిటో చాదస్తపు కబుర్లు

జేబులు ఒక్కటే యిలా అలంకరణార్థం మిగిలి పోయేయి అనుకునేరు! గుండీలు మరీనీ!! బుష్ షర్టుకి కాలరుకింద ఎందుకూ ఆ బొత్తాయి? కానీ, అదే లేకపోతే "అబ్బీ మెయిలరేకుట్టేడా ఆ బుష్షర్టు? లేకపోతే చవకని ఏ గొడారివాడి చేతనయినా కుట్టించేసేవా?" అని పరామర్శి స్తారు మిత్రులు కోటుకయితే చేతులక్రింద చెరి నాలుగు బొత్తాయిలు ఉండవలసిందే అజాగళస్తనాల్లాగ 'స్పోర్ట్సు' కోటు అయితే ప్రతీ జేబుమీదా వో కొమ్ముగుండీ ఉండితీరాలి. నడుంపీద పట్టీకి యిరుపక్కలాఉన్న రెండూ కాక! అవి పెట్టుకోవడం మాత్రం నిషేధం. డబుల్ బ్రెస్టు కోటుకయితే కాజాలయినా లేకుండా కనీసం రెండు బొత్తాయిలు అఘోరిస్తాయి. ఇంక వేస్టుకోటు చివర గుండీ కాజా ఉన్నా పెట్టుకోవడం ఫ్యాషనుకాదు కాలక్రమేణా ఒక్కొక్కటి చొప్పున ఆ వేస్టు కోటు బొత్తాయిలు ఏవీ పెట్టుకోవడం ఫ్యాషను కాకుండా పోయినా, బొత్తాయిలు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతాయి అనడానికి సందేహం లేదు—సింగిల్ బ్రెస్టు కోటుగుండీల్లాగ హాఫ్‌హేండు షర్టుపై గుండీ గూడా యీ పంపిణిలోకే వస్తుంది.

ఇహ మిలటరీ డ్రెస్సుల బొత్తాయిలయితే లెక్కాపత్రం లేదు. వాళ్ళ యూనిఫారాలకి ఆ బొత్తాయిలు వో అలంకారం అన్నీ యిత్తడి గుండీలూ అవీ అవడం మూలాన్ని, వాటిని పోలిష్ చేసి దర్జా వెలిగిస్తారు వాళ్లు వాళ్ళ బొత్తాయిలు అలా వెలగనూ వెలుగుతాయి మెరిసిపోతూనూ. కాని మనవో? కత్రతోనో, కొమ్ముతోనో, ప్లా స్టిక్‌తోనో చేస్తారు—వెలావెలాపోతూనూ. పైగా బట్ట తాలూకు రంగుతో యిమిడిపోయి మరీ యేడుస్తాయి. ఎవడి కంటయినా పడితే దిష్టి గొట్టిపోతుందేమోనన్నట్టు! అయినా సూటూ అనుకునేసరికి వెరసి యిరవైయ్యెనిమిది బొత్తా యిలూ ఉండాల్సిందే మూడు మూర్తులకినీ. వాటిలో ఏ ఒక్కటి తక్కువయినా ఎంత వెలితి! ★

